సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం। 2 । డిసెంబర్ । 2024



తొలి జీతం.. దూరం

కొత్తగా విధుల్లో చేరిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు నేటికీ వేతనాలు అందలేదు.

వివరాలు 8లో ▸



రగ్బీ విజేత పాలమూరు

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్ – 14 రగ్బీ పోటీల్లో పాలమూరు జట్లు విజేతగా నిలిచాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /20.7

ఉదయం, సాయంత్రం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ హైదరాబాద్ సెంట్రల్ జోన్ లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీగా బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ ఏసీబీ ఇన్‌చార్జ్‌గా డీఎస్పీగా నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్‌కు బాధ్యతలు అప్పగించారు. శ్రీకృష్ణగౌడ్ ఉమ్మడి జిల్లా డీఎస్పీగా దాదాపు ఏడేళ్లుగా పనిచేశారు. ఆయన హయాంలో ఏసీబీ శాఖను బలోపేతం చేయడంతోపాటు అధికంగా కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రమశిక్షణ తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ప్రధానంగా ఆయన ఫిర్యాదిదారులకు మద్దతుగా ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, అవగాహన కల్పించడం, చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలు ఎన్నో చేపట్టారు. ఈ ఏడాది అధికంగా కేసులు నమోదు చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచారు. ఇటీవల శ్రీకృష్ణగౌడ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి రావడం.. మహబూబ్‌నగర్ పోస్టు డీఎస్పీ ర్యాంక్ కావడంతో ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ హైదరాబాద్ సెంట్రల్ జోన్ అదనపు డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. శ్రీకృష్ణగౌడ్ సోమవారం రిలీవ్ కావడంతోపాటు ఇన్‌చార్జ్ డీఎస్పీగా జగదీశ్ చందర్ బాధ్యతలు తీసుకోనున్నారు.

కనీవినీ ఎరగని రీతిలో రైతు సభ



స్టేషన్ మహబూబ్‌నగర్: భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్‌లో నిర్వహించిన రైతు పండుగ సభ కనీవినీ ఎరగని రీతిలో విజయవంతమైందని, ఈ మేరకు ప్రతిఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఊహించినదానికంటే ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనడం తమ ప్రభుత్వ ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు. గతంలో చాలా ముఖ్యమంత్రులు ఉన్నప్పటికీ ఎవరూ పాలమూరును ఎవరూ పట్టించుకోలేదని, జిల్లా వాసి సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లపాటు రూ.లక్ష కోట్లు కేటాయిస్తానని మంత్రివర్గ సహచరుల అనుమతితో చెప్పడం గొప్ప విషయమన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రైతు సభనుద్దేశించి తప్పుడుగా మాట్లాడడం సిగ్గుచేటని, రైతులు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారని చెప్పారు. ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ రైతు పండుగ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, రాములుయాదవ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మా తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న భూమికి హద్దు రాళ్లు లేకపోవడంతో పక్క పొలం వాళ్లు మా పొలంలోకి జరుగుతున్నారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. మా భూమి ఇక్కడి వరకు ఉందని రాళ్లు పాతుతున్నారు. నా పాస్ బుక్కులో ఉన్నంత భూమి కొలిచి ఇవ్వండి అంటూ ఓ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్న రైతుకు న్యాయం జరగడం లేదు. సర్వే కోసం దరఖాస్తు పెడితే టీపన్‌లు లేవని, హద్దు రాళ్లు కూడా లేకపోవడంతో కొలిచేందుకు వీలు పడదని ప్రభుత్వ సర్వేయర్ వెళ్లిపోతున్నారు. నాకు ఎలాగైనా న్యాయం చేయాలంటూ ప్రతి సోమవారం ప్రజావాణిలో సదరు రైతు గోడు వెళ్లబోసుకుంటూనే ఉన్నాడు.

కొలతల నిర్వహణకు టీపన్ మ్యాపులు, క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లే ప్రామాణికం. ఈ రెండూ లేకపోతే సర్వే చేయడం అసాధ్యం. అయితే జిల్లాలో భూ సమస్యల్లో ప్రధానంగా సబ్‌డివిజన్ కొలతలు చేసి సమస్యను పరిష్కరించాలనే దరఖాస్తులే వస్తున్నాయి. సర్వే నంబర్‌లోని సబ్‌డివిజన్ కొలతల నిర్వహణ పలు కారణాలతో సాధ్యపడకపోవడంతో సమస్యలు భూ యజమానులను చుట్టుముడుతున్నాయి. ఎన్ని భూ చట్టాలు వచ్చినా ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. ఫలితంగా గ్రామాల్లో గొడవలు, కుటుంబాల మధ్య కక్ష్యలు, కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి.

తీరని వెతలు

జిల్లాలో పరిష్కారానికి నోచుకోని భూ సర్వే సమస్యలు



- టీపన్‌లు, హద్దు రాళ్లు లేకపోవడమే ప్రధాన కారణం
- సర్వే నంబర్‌లో అందరూ ఒప్పుకొంటేనే కొలతలు సాధ్యం?
- దరఖాస్తు చేసి కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- ఏళ్లతరబడిగా ఇబ్బందులు పడుతున్న భూ యజమానులు

సర్వే నంబర్లు	భూ విస్తీర్ణం
6,91,529	6,49,974 ఎకరాలు
పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌లైన్ దరఖాస్తులు	250

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భూ ప్రక్షాళనతో రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్, ధరణి పోర్టల్, నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు, ముటేషన్లు వంటి ఎన్నో మార్పులు తెచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వే సమస్యలపై మాత్రం దృష్టి సారించడంలేదు. నిజాం కాలంలో చేసిన భూ సర్వే ఆధారంగానే లావాదేవీలన్నీ జరుగుతున్నాయి. ప్రతి 25 ఏళ్లకోసారి భూ సర్వే చేయాలని ఉన్నా దాన్ని చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో భూ సమస్యలు పెరిగిపోతున్నాయి. హద్దుల గొడవలు, గెట్టు పంచాయితీలు, కబ్జాలో ఉన్నది కాకుండా ఇతర సర్వే నంబర్లు పాస్‌బుక్కులో నమోదవడం వంటి సమస్యలు భూ యజమానులను పట్టిపీడిస్తున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వంలో జరిగిన భూప్రక్షాళన కార్యక్రమం ఫలితంగా నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో వాస్తవ విరుద్ధమైన సర్వే నంబర్లు దర్శనమిచ్చాయి. తప్పుగా నమోదైన సర్వే నంబర్లను సరిచేయాలని తిరుగుతూనే ఉన్నా ఫలితం దక్కడం లేదు. గతంలో ఆర్వోఆర్, పహాణిలో నమోదైన వివరాలకు, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకంలో వచ్చిన భూ వివరాలకు వ్యత్యాసం ఉండటం చాలా గ్రామాల్లో భూ యజమానులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

చిత్తశుద్ధితో వ్యవహరించాలి..



సర్వే సమస్యలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. సర్వే టీపన్‌లు లేకపోవడం, సబ్ డివిజన్ కొలతలు సాధ్యపడకపోవడంతో క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పెరిగి గొడవలు, కేసులు, కక్ష్యపూరిత వాతావరణం నెలకొంటున్న పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ప్రత్యేకించి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలో సమూల మార్పులు తీసుకువచ్చి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– లక్ష్మయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

కొలతలు సాధ్యపడటం లేదు..

భూ సమస్యలపై వస్తున్న దరఖాస్తులన్నీ సబ్ డివిజన్ సమస్య మీదనే ఎక్కువగా వస్తున్నాయి. సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ కొలతలకు చాలా గ్రామాల్లో టీపన్‌లు అందుబాటులో లేవు. సర్వే నంబర్‌లోని భూ యజమానులందరూ అంగీకరిస్తేనే సబ్ డివిజన్ కొలతలు సాధ్యమవుతాయి.

– కిషన్‌రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ

సబ్ డివిజన్ సమస్యతో..

భూ సమస్యల పరిష్కారానికి ప్రధానంగా సర్వే నిర్వహణ కీలకం. అయితే సమస్య వచ్చినప్పుడు భూ యజమానులు సర్వే కోసం దరఖాస్తులు చేస్తున్నా పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్వే నంబర్‌లోని విస్తీర్ణంలో భూ యజమానులకు కేటాయిస్తున్న సబ్‌డివిజన్ నంబర్లు సమస్యకు కారణవుతున్నాయి. సర్వే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలు చేసేందుకు సంబంధిత టీపన్ మ్యాపులు ఉండాలి. అయితే జిల్లాలోని చాలా గ్రామాల్లో సర్వే నంబర్లకు అవేమీ లేవు. దీంతో సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ సమస్య పరిష్కారానికి కొలతలు నిర్వహించే వీలులేకుండా పోతోంది. సర్వే నంబర్ మొత్తం విస్తీర్ణాన్ని కొలత చేసి సర్వేయర్లు చేతులు దులుపుకొంటున్నారు. సర్వే నంబర్‌లోని మొత్తం భూ యజమానులు అంగీకారం తెలిపితే గాని సబ్‌డివిజన్ వారిగా కొలతలు చేసి సమస్యకు పరిష్కారం చూపే వీలుంటుంది. అయితే సమస్య వచ్చిన సర్వే నంబర్లలో ఎవరో ఒకరు ఒప్పుకోకపోతే కొలతలు నిర్వహించే అవకాశం లేకపోవడం, సర్వేయర్లకు పూర్తిస్థాయిలో అధికారాలు లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాగా జిల్లాలో సర్వే కోసం వచ్చిన ఎఫ్‌లైన్ దరఖాస్తులు దాదాపుగా 250 దాకా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



చిన్నదర్పల్లి వద్ద సర్వే నం.41లో సర్వే కోసం మ్యాపును పరిశీలిస్తున్న ఏడీ, సర్వేయర్ (ఫైల్)

నిర్వహణకు నిధులు



- ఉమ్మడి జిల్లాలోని 207 స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.68 లక్షలు విడుదల
- ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.33 వేలు
- ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర ఖర్చులకు వెచ్చింపు
- ఎంఈఓలకు తగ్గి.. కాంప్లెక్సు హెచ్‌ఎంలకు పెరిగిన బాధ్యతలు

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

జిల్లా	స్కూల్ కాంప్లెక్స్‌లు	విడుదలైన నిధులు (రూ.లక్షల్లో)
నాగర్‌కర్నూల్	57	18.81
మహబూబ్‌నగర్	53	17.49
వనపర్తి	35	11.55
నారాయణపేట	33	10.89
జో.గద్వాల	29	9.57

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌కు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. మొత్తం 1,860 ఉన్నత పాఠశాలల్లో 207 కాంప్లెక్స్ పాఠశాలలకు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలకు సాధారణంగా అక్కడ చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయిస్తారు. ఈ కాంప్లెక్సు పాఠశాలలకు సాధారణ గ్రాంట్స్‌తోపాటు అదనంగా కాంప్లెక్సు నిధులను కేటాయిస్తారు. గతంలో ప్రభుత్వం వీటిని రెండు విడతలుగా కేటాయించేది. కానీ ప్రస్తుతం ఒకే విడతలో నిధులను విడుదల చేసింది. ఇందులో ఒక్కో పాఠశాలలకు రూ.33వేలను అందజేయనున్నారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో 168 ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో 53 కాంప్లెక్సు హోదా ఉన్న పాఠశాలలు ఉన్నాయి. వీటికి రూ.17.49 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ క్రమంలో సకాలంలో నిధులు ప్రభుత్వం విడుదల చేయడంతో స్కూల్ కాంప్లెక్సు హెడ్‌మాస్టర్లు ఆనందం వ్యక్తం చేశారు.

కాంప్లెక్స్ ఖర్చుల నిమిత్తం

ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో మొత్తం 10 నుంచి 15 పాఠశాలలు ఉంటాయి. ప్రతి నెల కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు కాంప్లెక్సు సమావేశాలను నిర్వహిస్తారు. ఇందులో టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను ఉపాధ్యాయులు తయారు చేయాల్సి ఉంటుంది. వీటి తయారీకి కాంప్లెక్సు నిధులు వినియోగిస్తారు. అలాగే శిక్షణ సమయంలో అవసరయ్యే టీలు, పేపర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్, ఫోన్ బిల్లులు, ట్రావెల్ చార్జీలు తదితర ఖర్చుల నిమిత్తం వీటిని వినియోగించుకోనున్నారు. జిల్లాకు చేరిన నిధులను అధికారులు వివిధ కాంప్లెక్సు పాఠశాలల ఖాతాల్లోకి త్వరలోనే జమచేయనున్నారు. ప్రభుత్వం ఎంఈఓలకు బాధ్యతలను తగ్గించిన నేపథ్యంలో కాంప్లెక్సు హెడ్‌మాస్టర్ల బాధ్యతలను పెంచారు. నిధుల విడుదలతో వారికి ఎంతో ప్రయోజనం కలగనుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



స్కూల్ కాంప్లెక్సులకు రూ.33 వేల చొప్పున విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన నిధులు పాఠశాలల ఖాతాలో జమ కానున్నాయి. నిధులను అవసరాలకు అనుగుణంగా నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలి. కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయాలి.

– గోవిందరాజులు, డీఈఓ, నారాయణపేట

సామాజిక చైతన్యంతోనే సాహిత్యం సుసంపన్నం



మాట్లాడుతున్న ప్రసిద్ధ రచయిత నాళేశ్వరం శంకరం

స్టేషన్ మహబూబ్‌నగర్: కవులు, రచయితల్లో సామాజిక అస్తిత్వం, చైతన్యం ఉంటేనే వారు వెలువరించే సాహిత్యం సుసంపన్నమవుతుందని ప్రసిద్ధ రచయిత, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'సాహిత్యం– సమాజం' అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. సాహిత్యంలో పాటకు ప్రత్యేక స్థానం ఉందని, ఉద్యమకారుని పాట సమాజాన్ని చైతన్యవంతం చేస్తుందన్నారు. సాహితీ వేత్తలు కేవలం కవితల వరకు పరిమితం కాకుండా వివిధ సాహిత్య ప్రక్రియల్లో విశ్లేషణాత్మక, వివరణాత్మక అంశాలతో సాహిత్య సేద్యాన్ని చేయాలని తెలంగాణ రాష్ట్ర సాహితీ అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, ఉపాధ్యక్షుడు అనంతోజు మోహనకృష్ణ అన్నారు. సమావేశానికి ప్రసిద్ధ గజల్ కవి వెంకటేశ్వరశర్మ, కవి సమ్మేళనానికి ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 45 మంది కవులు తమ కవితా గానాన్ని వినిపించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనొద్దీన్, కొప్పోలు యాదయ్య, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోద్‌కుమార్, వనపర్తి జిల్లా కార్యదర్శి రాజారాం ప్రకాశ్, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్, భానుచందర్, సురభి జగపతిరావు, భాస్కరయ్య, పొద్దుటూరు ఎల్లారెడ్డి, వనపట్ల సుబ్బయ్య, వెన్నెల సత్యం, వైద్యం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులకు బాసటగా నిలుద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: బంగ్లాదేశ్‌లో ప్రపంచమంతా విస్తుపోయే విధంగా అతిభయానక వాతావరణంలో హిందువులు జీవిస్తున్నారని హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు అన్నారు. జిల్లాకేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందు కుటుంబాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, ఆస్తుల ఆక్రమణలు, ఆలయాలు, మఠాలపై దాడులు, హింస జరుగుతున్నాయని అన్నారు. ఈ దాడులను మనమందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో మంగళవారం హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు స్థానిక టీటీడీ కల్యాణ మండపం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమై క్లాక్‌టవర్ వరకు కొనసాగుతుందని, పెద్దఎత్తున పాల్గొని బంగ్లాదేశంలోని హిందువులకు బాసటగా నిలుద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో హిందు ఐక్యవేదిక కన్వీనర్ సీమ నరేందర్, ప్రతినిధులు మద్ది యాదిరెడ్డి, మెట్టుకాడి శ్రీనివాసులు, రెబ్బ విగ్నేశ్, రాజ మల్లేష్, వసంతపు వెంకటేశ్, మఠం మయూర్‌నాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడల సందడి

- సీఎం కప్ పోటీల నిర్వహణకు సన్నాహాలు
- గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రీడలు
- ఔత్సాహిక క్రీడాకారులు వెలుగులోకి..



మెయిన్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడల సందడి నెలకొననుంది. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం మే 15 నుంచి 31 వరకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించగా.. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం సైతం చీఫ్ మినిస్టర్స్ కప్–24 క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇదే నెలలో క్రీడాపోటీలు జరగనున్నాయి.

గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు

సీఎం కప్ క్రీడలను గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలు జరగనున్నాయి. ముఖ్యంగా గ్రామస్థాయిలో క్రీడలతో ఒక నూతనోత్సాహం నెలకొనే అవకాశం ఉంటుంది.

వివిధ క్రీడాంశాల్లో పోటీలు

సీఎం కప్ క్రీడా పోటీలకు ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులకు వేదికలా ఉపయోగపడనుంది. ఈ పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం ఉంటుంది. ఆర్చరీ, అథ్లెటిక్స్, అత్యపత్య, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బిలియర్డ్ స్నూకర్, బాక్సింగ్, కనోయింగ్– కయాకింగ్, చెస్, సైక్లింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, ఖోఖో, కిక్‌బాక్సింగ్, లాన్ టెన్నిస్, నెట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, రోయింగ్, సెపక్ తక్రా, షూటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఉషూ, యోగా క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. వీటిలో కొన్ని క్రీడలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనుండగా.. మరికొన్ని క్రీడలకు రాష్ట్రస్థాయి పోటీలకు సెలక్షన్స్ నిర్వహించనున్నారు.

టార్చ్ ర్యాలీ విజయవంతం

సీఎం కప్– 24 క్రీడా పోటీలను పురస్కరించుకొని గత నెలలో నిర్వహించిన టార్చ్ ర్యాలీ ఉమ్మడి జిల్లాలో విజయవంతమైంది. అక్టోబర్ 18 నుంచి 20 తేదీల్లో జిల్లా యువజన, క్రీడల అధికారుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో టార్చ్ ర్యాలీ చేపట్టారు. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు టార్చ్ ర్యాలీలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

పతకాలు సాధించాలి



సీఎం కప్ పోటీలు ఔత్సాహిక క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికలా ఉపయోగపడుతుంది. సీఎం కప్ క్రీడలతో గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు ఒక పండుగ వాతావరణం నెలకొంటుంది. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో ట్రోఫీలు, పతకాలు సాధించి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలి.

– వేణుగోపాల్, సీనియర్ పీడీ, చిన్నదర్పల్లి

మంచి అవకాశం..



సీఎం కప్ క్రీడలు ఔత్సాహిక క్రీడాకారులకు మంచి అవకాశం. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యం బయటికి వస్తుంది. క్రీడాసంఘాలు, పీడీలు, అందరి సహకారంతో జిల్లాలో ఈ నెలలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తాం.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ

సద్వినియోగం చేసుకోవాలి



సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుండడం సంతోషంగా ఉంది. ఈ క్రీడా పోటీలను గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. గతేడాది నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచాయి. అదే స్ఫూర్తితో ఈసారి జరిగే క్రీడాపోటీల్లో రాణించాలి.

– జగన్‌మోహన్‌గౌడ్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



భూగర్భ కేంద్రంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణను సత్కరిస్తున్న ఇంజినీర్లు

దోమలపెంట: అన్నివిధాలుగా వెనకబాటులో ఉన్న ఆదివాసీల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న మంత్రి.. తిరుగు ప్రయాణంలో శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సందర్శించారు. కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ (ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ (సివిల్) రవీంద్ర కుమార్, డీఈ (సేఫ్టీ) శ్రీకుమార్‌గౌడ్ మంత్రికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో ఇంజినీర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న ఇంజినీర్లు చీకట్లో కష్టపడుతున్నారని.. వారి సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కాగా, పదేళ్లుగా బదిలీలు లేక అవస్థలు పడుతున్నామని ఇంజినీర్లు మంత్రి దృష్టికి తెచ్చారు. డిస్కం, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ అన్నింటిలో ఇంజినీర్ల బదిలీలు క్రమంగా జరుగుతున్నాయని, జెన్‌కోలో మాత్రం జరగడం లేదని వాపోయారు.

కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం చివరిరోజు, అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం ఆలయాలు కార్తీక దీపాల వెలుగులో కాంతులీనాయి. పలు ఆలయాల్లో ఉదయం శివలింగాలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకంతోపాటు సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు ఆలయాల్లో కార్తీక దీపోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్



టీచర్స్‌కాలనీలోని రామాలయంలో కార్తీక దీపాల వెలుగులు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొల్లాపూర్: పట్టణంలోని ఖాదర్‌పాషదర్గా రోడ్డులో తూళ్ల సత్యం(60) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్‌ఐ హృషికేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున సత్యం తన ఇంటికి సమీపంలోని చింతచెట్టుకు ఉరేసుకొని చనిపోవడంపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. చిన్నభార్యకు ఒక కూతురు ఉంది. ఆమె చాలాకాలం క్రితమే సత్యంను విడిచివెళ్లిపోయింది. పెద్దభార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు సత్యం మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణమ్మ (55) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: ఓమైనర్ బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన ఇంటర్ చదువుతున్న 17 సంవత్సరాల మైనర్ బాలిక ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేములలో యువతి..

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకి చెందిన ఓ యువతి(20) అదృశ్యమైంది. ఆమె తండ్రి కుమ్మరి ఆంజనేయులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గత నెల 30న అంజనేయులు తన ఆటోను తీసుకుని బయటకు వెళ్లాడు. మధ్యాహ్న వేళ ఇంటి నుంచి తన కుమార్తె ఎక్కడికో పోయింది. ఊర్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన సాయన్న కుమారుడు వెంకటేశ్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారిపై అత్యాచారయత్నం

తాడూరు: మండలంలోని ఓ గ్రామంలో చిన్నారిపై ఓ బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఆదివారం తన ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న చిన్నారిపై అదే గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం: గద్వాల–శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ మధ్యలో శనివారం రాత్రి రైలుకింద పడి ఓ యువకుడు(35) మృతి చెందినట్లు రైల్వే కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపారు. నీలంరంగు చొక్కా, బూడిదరంగు ప్యాంటు ధరించాడని, వివరాలకు గద్వాల రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుత్రి మార్చురీలో భద్రపర్చారు.

బైక్ ఢీకొని ఆర్టీసీ డీఎంకు తీవ్ర గాయాలు

మల్దకల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న గద్వాల ఆర్టీసీ డీఎంను అటుగా వెళ్తున్న బైక్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. వివరాలు.. శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని అయిజ మండలంలోని ఉప్పల గ్రామానికి చెందిన చిన్న కిష్టన్న మృతిచెందాడు. ఆదివారం ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద అయిజ–గద్వాల ప్రధాన రహదారిపై జరిగిన సంఘటనను డీఎం మురళీకృష్ణ పరిశీలించేందుకు వెళ్లారు. ఈక్రమంలో రోడ్డు పక్కన ఘటనా స్థలాన్ని పనిశీలిస్తుండగా.. అయిజ నుంచి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు డీఎంను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను 108లో మొదట గద్వాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు రెఫర్ చేసినట్లు 108 ఈఎంటీ ఆంజనేయులు, పైలట్ శ్రీనివాసులు తెలిపారు.

తొలి జీతం.. దూరం

వేతనానికి నోచుకోని కొత్త టీచర్లు



విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు (ఫైల్)

- ప్రాన్ నంబర్ల కేటాయింపులో జాప్యం
- ట్రెజరీ కార్యాలయంలో తప్పని తిప్పలు
- యాక్ట్–2 అందించడంలోనూ విద్యాశాఖ నిర్లక్ష్యం

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని డీఎడ్, బీఎడ్ విద్యార్హతలను పూర్తిచేసి ఏళ్ల నిరీక్షణ తర్వాత పరీక్షలు రాశారు. మంచి ర్యాంకులు తెచ్చుకొని ఉద్యోగం సాధించిన కొత్త టీచర్లకు తొలి జీతం తీసుకుందామన్నా తిప్పలు తప్పడం లేదు. నెలనెలా వేతనం తీసుకునేందుకు ట్రెజరీ కార్యాలయంలో ఎంప్లాయి ఐడీతో పాటు ప్రాన్ నంబర్ జనరేట్ చేస్తారు. ఇందుకోసం కొత్త టీచర్లు ట్రెజరీ ఆఫీస్ చుట్టూ రోజూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొలువులో చేరి నెలన్నర రోజులు గడుస్తున్నా నేటికీ చాలా మందికి పనులు జరగడం లేదు. ట్రెజరీ ఆఫీస్ సిబ్బంది తీరుతో ఇప్పటికీ టీచర్లు మొదటి జీతాన్ని అందుకోలేదు.

929 మంది కొత్త టీచర్లు..

ఉమ్మడి జిల్లాలో 929 మంది కొత్త టీచర్లు కొలువుల్లో చేరారు. నారాయణపేట జిల్లాలో 254 మంది టీచర్లు నియామకం కాగా.. వారిలో ఎస్–ఏ ఇంగ్లిష్‌లో ఇద్దరు, ఒక ఎస్జీటీ జాయిన్ కాలేదు. హిందీ పండిట్‌లో ఒక అభ్యర్థిపై ఫిర్యాదు ఉండటంతో అది పెండింగ్‌లో ఉంది. మరో ఇద్దరికి సంబంధించి జన్యునిటీ సర్టిఫికెట్ కోసం రెండు పోస్టులు రిజర్వ్‌లో ఉన్నాయి. ఇవి పోగా మిగిలిన 248 మంది వారు కౌన్సెలింగ్‌లో ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో విధుల్లో చేశారు. వీరితో పాటు వనపర్తి జిల్లాలో 139 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలో 140, మహబూబ్‌నగర్ జిల్లాలో 193, నాగర్‌కర్నూల్ జిల్లాలో 209 మంది ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు రాలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

నారాయణపేట	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	జోగుళాంబ గద్వాల
248	193	209	139	140



జిల్లా ట్రెజరీ కార్యాలయం

ఐడీ, ప్రాన్ కోసం వసూళ్లు.?

వేతనాల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు తప్పనిసరిగా ట్రెజరీ ఐడీతో పాటు ప్రాన్ నంబర్ కావాలని కోరడంతో టీచర్లు ట్రెజరీ ఆఫీస్‌కు బారులు తీరుతున్నారు. జిల్లా ట్రెజరీ అధికారులు కేటాయించే ట్రెజరీ ఐడీ, ప్రాన్ నంబర్ల ఆధారంగానే కొత్త టీచర్ల జీతాల బిల్లులు చేయాల్సి ఉంటుంది. దీంతో ఇదే అదునుగా ట్రెజరీ ఆఫీసులోని కొందరు కింది స్థాయి అధికారులు వసూళ్ల పర్వానికి తెరలేపారు. టీచర్ల పని కావాలంటే తప్పకుండా డబ్బులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. కొందరు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సైతం తాము పని చేయిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, ఎవరైతే డబ్బులు ఇస్తున్నారో వారికే ట్రెజరీ ఐడీ, ప్రాన్ నంబర్లకు సంబంధించిన పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వని టీచర్లకు నిబంధనల పేరుతో ఇంకా సమయం పడుతుందంటూ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని పలువురు టీచర్లు వాపోతున్నారు. అయితే ఉపాధ్యాయుల ఎంప్లాయి ఐడీని ఎలాంటి ఇబ్బంది లేకుండా డీటీఓ కార్యాలయంలో క్రియేట్ చేసి ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ప్రాన్ నంబర్ కోసం ఎస్టీఓ కార్యాలయాల్లో అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు..



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పనిచేస్తుంది. కొత్తగా విధుల్లో చేరిన టీచర్లు తమ పనుల కోసం ఎక్కడ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఐడీ, ప్రాన్ నంబర్‌తో పాటు ఏ పనైనా సంఘ నాయకులను సంప్రదించాలి. లంచం తీసుకోవడమే కాదు ఇవ్వడం నేరమని ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి. – వై.జనార్దన్ రెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు

నా దృష్టికి రాలేదు..



కొత్త టీచర్లకు ట్రెజరీ ఐడీ, ప్రాన్ నంబర్లు మా శాఖ ఆధ్వర్యంలోనే కేటాయిస్తున్నాం. వీటి కోసం మా కార్యాలయ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. సిబ్బందితో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త టీచర్లకు ట్రెజరీ ఐడీ, ప్రాన్ నంబర్లు కేటాయిస్తాం. కొత్త టీచర్ల జీతాలకు సంబంధించి తేదీ విషయంలో నెలకొన్న గందరగోళానికి ఇంకా క్లారిటీ రాలేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం కొత్త టీచర్లకు జీతాలు చెల్లిస్తాం. – హరి ప్రసాద్, జిల్లా ట్రెజరీ అధికారి

తప్పని ఎదురుచూపులు..

కొత్త టీచర్ల ఐడీ, ప్రాన్ నంబర్లు తప్పనిసరి కావడంతో వారు పనిచేస్తున్న మండలాల నుంచి జీతాల బిల్లులను ట్రెజరీ ఆఫీస్‌కు పంపించలేక పోతున్నారు. దీంతో ఈ నెల 1న కూడా వారు మొదటి జీతం పొందలేక పోయారు. ఇక సప్లిమెంటరీ బిల్లు చేస్తే కొత్త ఏడాది 2025 జనవరిలో వేతనం వస్తుందని భావిస్తున్నారు. కొత్త ఉద్యోగం మొదటి జీతం కళ్ల చూద్దామంటే ట్రెజరీ ఆఫీసర్ల ఇబ్బందులతో ఆ కల దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేదీ విషయంలోనూ గందరగోళం..

డీఎస్సీ 2024లో ఎంపికైన ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ధ్రువపత్రాలను అందించారు. వాస్తవానికి దసరా సెలవులు ఉండటంతో అక్టోబర్ 16న ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఆ రోజు నుంచే జీతాలు చెల్లించేందుకు ట్రెజరీ కార్యాలయం నిబంధనలు వర్తిస్తాయి. అయితే అక్టోబర్ 10న సీఎం నియామక పత్రాలు అందించడంతో, అదే రోజు నుంచి జీతాలు చెల్లించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అయితే నిబంధనలను సవరించేందుకు ఎలాంటి జీఓ ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు జిల్లా విద్యాశాఖ ఇవ్వాల్సిన యాక్ట్–2 ఫామ్ సైతం ట్రెజరీకి పంపకపోవడం మరో కారణంగా తెలుస్తోంది.

సాంబార్ కణితి అధికారులకు అప్పగింత

అడవిలో వదిలిన ఫారెస్ట్ శాఖ సిబ్బంది

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల ఫారెస్ట్ నుంచి సోమశిల గ్రామానికి వచ్చిన సాంబార్ కణితిని గ్రామస్తులు కుక్కల బారి నుంచి కాపాడారు. ఆదివారం కొల్లాపూర్ ఫారెస్ట్ అధికారులకు సాంబార్ కణితిని గ్రామస్తులు అప్పగించారు. ఈ కణితికి వెటర్నరీ డాక్టర్ పాషాఖాన్ చికిత్స చేశా రు. అనంతరం సమీపంలో ఉన్న అడవిలో ఫారెస్ట్ అధికారులు కణితిని వదిలిపెట్టారు. కార్యక్రమంలో అధికారులు ముజీబ్‌ఘోరి, వెంకటయ్య నిరంజన్, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారులకు సాంబార్ కణితి అప్పగిస్తున్న సోమశిల గ్రామస్తులు

పత్తి వాహనాల బారులు



లింగంపల్లి వద్ద నిలిచిన పత్తి వాహనాలు

మక్తల్ మండలం లింగంపల్లిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద పత్తి లోడుతో నిండిన వాహనాలు బారులు తీరాయి. ఆదివారం సెలవుదినం కావడంతో పత్తి విక్రయించేందుకు వీలు లేక సోమవారం వరకు ఎదురుచూడక తప్పని పరిస్థితి. దీంతో రైతులు రోడ్డుపైనే దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిపారు. – మక్తల్

హోంగార్డుపై ఎస్పీకి ఫిర్యాదు

గద్వాల క్రైం: భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన హోంగార్డు నిజాంపాషపై ఆదివారం ఎస్పీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు. గద్వాల పట్టణంలోని నదీఅగ్రహారం రోడ్డుమార్గంలో వెలసిన శ్రీఅడవి ఆంజనేయ స్వామి దేవాలయంలో నవంబర్ 30వ తేదీన ఆంజనేయ మాలధారులు భజన, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. హోంగార్డు దేవాలయం వద్దకు చేరుకుని భజనలు నిలిపి వేయాల్సిందిగా కోరాడు. హిందూవుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశాడు. అతడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా.. భజనలు, ప్రత్యేక పూజల సమయంలో దేవాలయం నుంచి పెద్దఎత్తున శబ్దాలు వినిపిస్తున్నాయని గుర్తుతెలియని వ్యక్తులు డయల్ 100కు సమాచారం అందించారు. ఈ క్రమంలో హోంగార్డు అక్కడికి చేరుకుని భజనలు, పూజలు తక్కువ శబ్దంతో కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిందిగా చెప్పాడు. ఈ క్రమంలో సమస్యకు దారితీసిందని కొంత మంది భక్తులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థికి గాయం

మహమ్మదాబాద్: తోటి విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు గాయపడిన ఘటన మహమ్మదాబాద్ మండలంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని నంచర్ల గ్రామానికి చెందుతున్న హరికృష్ణ మహమ్మదాబాద్ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. ఎప్పటి మాదిరిగా ఉన్నత పాఠశాల ఆవరణలో తోటి విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతుండగా.. ప్రమాదవశాత్తు కాలు విరిగిపోయింది. విషయం తెలుసుకున్న వార్డెన్ చీన్యానాయక్ 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న విద్యార్థి హరికృష్ణ

మిరపలో బూడిద తెగులు



కాయతొలుచు పురుగు ఆశించిన పంట



బూడిద తెగులు ఆశించిన ఆకులు

సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి

అలంపూర్ : జిల్లాలో మిరప సాగు విస్తారంగా జరిగింది. ప్రస్తుతం పరిస్థితుల్లో బూడిద తెగులు, లద్దె పురుగు ఆశిస్తుందని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు సూచించారు. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రైతులు నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. బూడిద తెగులు, లద్దె పురుగు నివారణకు సూచనలు, సలహాలను ఈవిధంగా వివరిస్తున్నారు.

బూడిద తెగులు

ఈ తెగులు రావడానికి కారణం రాత్రి వేళల్లో వాతవరణం చల్లగా ఉండటం, పగటి పూట ఎండ ఉండటంతో బూడిద తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు వలన ఆకుల మీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చల నుంచి శిలీంధ్ర బీజాలు ఉత్పత్తి అయి ఆకుల మీద తెల్లటి పొడగా ఏర్పడతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు తెల్లటి పొడలు ఆకుల మీద, పిందెల మీద, కాయల మీద వ్యాప్తి చెందుతాయి. ఆకులు ఎండి పండుబారుతాయి. ఆకుల మీద తెల్లటి పొడ ఏర్పడటంతో కిరణజన్య సంయోగ ప్రక్రియ తగ్గిపోయి తగినంత ఆహార పదార్థాలు తయారు కాక కాయ నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ

ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 200 గ్రాములు, డైనోకాప్ 200 మి.లీ, బెలటాన్ 200 మి.లీ, ట్రైడిమార్ఫ్ 200 మి.లీ, అజాక్సి స్ట్రోబీన్ 200 మి.లీలను 200 లీటర్లలో కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి.

కాయతొలుచే పురుగు

ప్రస్తుతం కాయలకు కాయతొలిచే పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు కాయలోపలి భాగానికి ప్రవేశించి లోపల ఉన్న పదార్థాన్ని తినడంతో కాయ నాణ్యత పడిపోతుంది.

నివారణ

ఈ పురుగు నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ 1.0 మి.లీ, రెనాక్సి పైర్ 0.3 మి.లీ , ఫ్లూబెండమయిడ్ 0.3 గ్రాములు, క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

శ్వాస సమస్యతో వస్తే.. ప్రాణాలు తీశారు



గద్వాలలోని ఆసుపత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమంటూ ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా
- పరారీలో ఆసుపత్రి యాజమాన్యం

గద్వాల క్రైం: శ్వాస తీసుకోవడంలో సమస్యతో వస్తే ప్రాణాలు లేకుండా చేశారు ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు. ముక్కు సమస్య కారణంగా గద్వాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిన ఓ మహిళ పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. దీంతో ఆమె మృతికి ప్రైవేటు ఆసుపత్రి వైద్యులే కారణమంటూ ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. బంధువుల కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన బుడగా జంగాల కవిత(33) ముక్కు సమస్యతో బాధపడేది. వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి నవంబర్ 26న భర్త జమ్మన్నతో కలిసి వెళ్లింది. వైద్యులు పరీక్షించి లోపల గడ్డ ఉందని, శస్త్ర చికిత్స ద్వారా తొలగించాలని సూచించారు. వైద్యం కోసం రూ.20వేలు ఖర్చు అవుతుందని రోగి బంధువులకు తెలిపారు. గత నెల 28వ తేదిన శస్త్ర చికిత్స కోసం ఆసుపత్రికి రాగా సాయంత్రం ఆపరేషన్ థియేటర్‌లోకి వైద్యులు తీసుకెళ్లారు. కొద్ది సేపటికే రోగి కోమాలోకి వెళ్లిందని, మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో వెంటనే కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల పాటు అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. వారి బాగోగులు చూసేది ఎవరని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతరం అయ్యారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కవిత మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు గద్వాల పట్టణంలోని ప్రైవేటు ఆసుప్రతి వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. వైద్యులు ఆసుపత్రిని మూసివేయడంతో అక్కడే ధర్నా చేశారు. మృతికి కారకులైన వైద్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న గద్వాల పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఆస్పత్రికి తాళం వేసి..

చికిత్స పొందుతూ బుడగా జంగాల కవిత మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు వస్తున్నట్లు తెలుసుకున్న ఆసుపత్రి యాజమాన్యం ఆసుపత్రికి తాళం వేసి పరారైనట్లు బంధువులు ఆరోపించారు. ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆసుపత్రి యాజమాన్యంను సాక్షి సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. నాలుగు రోజుల క్రితం జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు మహిళకు చేసిన శస్త్ర చికిత్సపై నివేదిక ఇవ్వాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసినప్పటి నుంచే యాజమాన్యం అందుబాటులో లేకపోవడం కొసమెరుపు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలవగా.. పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని..

లింగాల: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కోడేరుకు చెందిన కుర్వ మల్లయ్య(55) మృతి చెందగా.. ఇద్దరు బాలురకు గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు లింగాల నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. అదే సమయంలో కోడేరుకు చెందిన గొర్రెల కాపరి మల్లయ్య లింగాల వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా వాహనాలు బలంగా ఢీకొనడంతో గొర్రెల కాపరి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే ఇద్దరు మైనర్లకు స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులను 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడు..

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ గ్రామ సమీపంలోని 167 జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో దోనూర్ గ్రామానికి చెందిన బర్ల కుమార్(32) అనే వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. దోనూర్ గ్రామానికి చెందిన కుమార్ స్ప్రింక్లర్ పైపుల సామగ్రి కోసం మిడ్జిల్‌కు మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. సామగ్రి తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా, మున్ననూర్ సమీపంలో మోటార్‌సైకిల్‌ను జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు అతివేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో మోటార్ సైకిల్‌పై ఉన్న కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఈ ఘటనపై కుమార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.



కుమార్ (ఫైల్)

రోడ్డు దాటుతుండగా..

జడ్చర్ల: పట్టణంలోని కావేరమ్మపేట వద్ద జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. బాలానగర్ మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన కావలి కృష్ణయ్య(62) జడ్చర్లలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో కావేరమమపేట వైపు నుంచి అవతలకు జాతీయ రహదారిని దాటుతుండగా కర్నూలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతి వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, డీసీఎం ఢీకొని..

మహబూబ్‌నగర్ క్రైం: కారు, డీసీఎం వాహనాలు ఢీకొట్టుకున్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం .. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి చెందిన అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఫయాజ్ ముగ్గురు కలిసి ఆదివారం కురుమూర్తిస్వామి జాతరకు వెళ్లి తిరిగి మహబూబ్‌నగర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో జేపీఎన్‌సీఈ కళాశాల దగ్గర డీసీఎం కారును ఢీకొట్టడంతో కారులో ఉన్న రవీందర్ రెడ్డి(40) అక్కడికక్కడే మృతిచెందగా అనంతరెడ్డి, ఫయాజ్‌కు గాయాలయ్యాయి. అయితే అనంత రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

గుడ్లగట్టుపై చిరుత సంచారం?

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్, సంజీవకొండ శివారులో ఉన్న గుడ్లగట్టుపై ఆదివారం సాయంత్రం చిరుత కనిపించింది. చిరుత కదలికలను గుర్తించిన రైతులు సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసి అటవీశాఖ అధికారులకు పంపించారు. గతంలో నిచ్చెనగట్టు, గుడ్లగట్టు మధ్యలో చిరుత మూగజీవాలపై దాడి చేసిందని రైతులు తెలిపారు. రాత్రి సమయంలో పొలాలకు వెళ్తుంటామని.. పొలాల దగ్గర ఉన్న పశువులపై దాడిచేసే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

పోలీసు ఉన్నతాధికారిపై కానిస్టేబుల్ దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ఉన్నతాధికారిపై సబ్‌జైలు కానిస్టేబుల్ దాడికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ పోలీసు ఉన్నతాధికారి తన కారులో పెట్రోల్ పోయించుకునేందుకు గాను జిల్లా కేంద్రంలోని సబ్‌జైలులో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు వచ్చారు. అయితే పెట్రోల్ బంక్‌లో సదరు అధికారి, సబ్‌జైలులో పనిచేస్తున్న కానిస్టేబుల్ మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారిపై కానిస్టేబుల్ దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారి కుటుంబ సభ్యులు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్‌గా మారింది. ఘటనకు సంబంధించి సబ్‌జైలు సూపరింటెండెంట్ నాగరాజును వివరణ కోరగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000707]

WANTED

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ; 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

క్లుప్తంగా...

చిత్రహింసలు పెట్టి చంపేశారు

- ములుగు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల నేతల ఆరోపణ



ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలను ప్రదర్శిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ములుగు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలో 16 మంది ఎన్‌కౌంటర్ పేరుతో చనిపోయారని తెలిపారు. ములుగులో మావోయిస్టుల శవాలు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు లేవని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లు ఉన్నాయని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శవ పరీక్షలు చేసి, ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్, పీడీఎస్ నేత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి దలేర్‌కు చెందిన కుమ్మేశ్ కుంజమ్‌ను రెండు రోజుల క్రితం మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. అతని గొంతుకోసి హతమార్చి మృతదేహాన్ని చితక్ టిండోడీ సమీపంలోని ప్రధాన రహదారిపై పడవేశారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామంటూ మావోయిస్టు పార్టీ బైరంఘడ్ ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.

దండకారణ్యం నుంచి సరిహద్దుకు?

ఇటీవలి కాలంలో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం

మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దులోకి వచ్చే అవకాశం ఉందన్న ఎస్ఐబీ

- పలువురు ఎస్పీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాలతో డీజీపీ భేటీ
- ఆ తర్వాతే వాజేడులో ఇద్దరు ఇన్‌ఫార్మర్లను హత్య చేసిన మావోయిస్టులు
- తాజా ఎన్‌కౌంటర్‌తో ఎస్ఐబీ అంచనా నిజమని తేలిన వైనం
- రాష్ట్రంలో సంచరిస్తున్న 15 మందిలో 14 మంది మృతి!



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/మంథని/ సాక్షి హైదరాబాద్: దండకారణ్యం నుంచి మావోయిస్టు సాయుధ దళాలు సేఫ్ జోన్‌గా భావిస్తున్న తెలంగాణ సరిహద్దుకు వచ్చాయా? ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దండకారణ్యం వీడుతున్నారా? పారా మిలటరీ, యాంటీ మావోయిస్టు స్క్వాడ్స్, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు, తీవ్రమైన నిర్బంధం నేపథ్యంలో ఎత్తుగడలలో భాగంగా తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నారా? రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించాలనుకున్నారా? అంటే నిజమేనంటున్నాయి పోలీసు వర్గాలు. దండకారణ్యం విడిచి తెలంగాణకు చేరుకుని కార్యకలాపాలు నిర్వహించే క్రమంలోనే కీలక మావోయిస్టు నేతలు కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న, ఏగోలపు మల్లయ్య అలియాస్ కరుణాకర్, కోటి, మధు సహా ఏడుగురు మావోయిస్టులు మృత్యువాత పడినట్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో దండకారణ్యంలో యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర సాయుధ బలగాలు నారాయణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ దండకారణ్యంలోకి చొచ్చుకుపోగా.. ఈ క్రమంలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో 254 మంది వరకు మృతి చెందినట్లు ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

ముందే పసిగట్టిన ఎస్ఐబీ..

2026 నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసు బలగాల చర్యలు అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వ్యూహం మార్చిన మావోయిస్టు అగ్రనేతలు, సాయధ దళాలు దండకారణ్యం నుంచి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించే అవకాశం ఉందని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అంచనా వేసింది. రాష్ట్ర పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే ఈనెల 11న తెలంగాణ డీజీపీ జితేందర్.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీలు, ఓఎస్డీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాల ఇన్‌చార్జిలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇది జరిగిన పది రోజులకు మావోయిస్టులు ములుగు జిల్లా వాజేడులో పంచాయతీ కార్యదర్శి ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేశారు. అనంతరం రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్ సైతం చోటు చేసుకోవడంతో ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా నిజమని తేలింది. మావోయిస్టు అగ్ర నాయకత్వంలో ఉన్న పలువురు తెలుగు రాష్ట్రాల నాయకుల్లో కొందరు ఆరోగ్య సమస్యలతో ఉన్నట్టు సమాచారం. దీంతో పాటు తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న దండకారణ్యంలోని ఒక్కో స్థావరాన్ని కేంద్ర పారా మిలటరీ బలగాలు స్వాధీనం చేసుకుంటుండటంతో కొత్త ప్రదేశాలకు మకాం మార్చే యోచనలో భాగంగా మావోయిస్టు దళాలు సరిహద్దుకు చేరాయని తెలుస్తోంది.

ఉనికి ఉన్నట్టుగా లేఖలు

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో దళాల సంచారం లేకున్నా వివిధ ఏరియా కమిటీల పేరిట తరచుగా లేఖలు విడుదల చేస్తూ వచ్చారు. సాధారణంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు - భద్రాద్రి కొత్తగూడెం (ఏఎస్ఆర్‌బీకే) డివిజన్ కమిటీల పేర్లతో లేఖలు వస్తుంటాయి. ఆ తర్వాత మంచిర్యాల - పెద్దపల్లి - భూపాలపల్లి-ములుగు జిల్లాల డివిజన్ పేరిట కూడా లేఖలు వచ్చేవి. కానీ 2023 రెండో అర్ధభాగం నుంచి 2024 తొలి అర్ధభాగం వరకు పాల్వంచ - మణుగూరు, ఇల్లెందు - నర్సంపేట, సింగరేణి, చర్ల - శబరి తదితర ఏరియా కమిటీల పేర్లతో లేఖలు రావడం ఎక్కువైంది. తద్వారా తెలంగాణలో తమ ఉనికి ఉన్నట్టుగా చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు.

తుడిచిపెట్టుకుపోయిన లచ్చన్న, భద్రు దళాలు

వివిధ కమిటీల పేర్లతో లేఖల జారీల అనంతరం జూన్‌లో మావోయిస్టులు గోదావరి తీరం దాటి తెలంగాణలోకి వచ్చినట్టు గట్టిగా ప్రచారం జరిగింది. దీనికి తగ్గట్టుగానే ములుగు - భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో గుండాల మండలం దామెరతోగు అడవుల్లో జూలై 25న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ కాల్పులపై పోలీసులు స్పందిస్తూ.. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతో పాటు దాదాపు 15 మంది మావోయిస్టులు ఆయుధాలతో సంచరిస్తున్నట్టు సమాచారం అందిందని, ఈ మేరకు చేపట్టిన కూంబింగ్.. ఎదురు కాల్పుల్లో ఒకరు చనిపోయారని ప్రకటించారు. కాగా భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో సెప్టెంబర్ 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్వంచ- మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్నతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. ఒక మావోయిస్టు తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. దీంతో ముందుగా పేర్కొన్న 15 మందిలో మొత్తం ఏడుగురు చనిపోయినట్టయ్యింది. లచ్చన్న దళం తుడిచిపెట్టుకుపోయినా భద్రు అలియాస్ మంగు దళం జాడ పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే తాజాగా ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మరణించడంతో భద్రు దళం మొత్తం హతమైంది.

భారీ నష్టం..

తాజా జరిగిన భారీ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల రఘునాథపాలెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యులలో లచ్చన్న, లచ్చన్న సతీమణి తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ మరణించిన విషయం తెలిసిందే. కాగా ములుగు ఎన్‌కౌంటర్‌లో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీతోపాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన యువ మావోయిస్టులు చనిపోవడం మావోయిస్టులకు తీరని నష్టమేనని అంటున్నారు. ఇటీవల దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు తొలితరం అగ్రనాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు హతమైన విషయం కూడా తెలిసిందే.

ములుగు అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి



కుర్సం మంగు



ముస్సాకి దేవల్



ముస్సాకి జమున

కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక జీ-6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందు గుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్‌కౌంటర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెండ్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

కొనసాగుతున్న కూంబింగ్

భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడేలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

మృతుల వివరాలు.. లభ్యమైన ఆయుధాలు

1.కుర్సం మంగు: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామం. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద లభ్యమైన ఆయుధం ఏకే-47.

2.ఏగోలపు మల్లయ్య: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం. తెలంగాణ, డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద కూడా ఏకే-47 లభ్యమైంది.

3.ముస్సాకి దేవల్: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసుర్ గ్రామం. ఇతని వద్ద జీ3 రైఫిల్ లభ్యమైంది.

4.ముస్సాకి జమున: గొత్తికోయ. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బైరామ్‌ఘర్ గ్రామం.

5.జైసింగ్: పార్టీ సభ్యుడు. ఇంద్రావతి ప్రాంతం. లభ్యమైన ఆయుధం.303 రైఫిల్.

6.కిషోర్: పార్టీ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పీఎస్ పరిధి పాంపాడ్ గ్రామం. లభ్యమైన ఆయుధం ఇన్సాస్ రైఫిల్.

7. కామేష్: పార్టీ సభ్యుడు. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పీఎస్ పరిధి మలంపెంట గ్రామం. లభ్యమైన ఆయుధం ఎస్‌బీబీఎల్ గన్.

రగ్బీ విజేత పాలమూరు

- బాలుర, బాలికల విభాగాల్లో అదరగొట్టిన ఆతిథ్య జట్లు
- రన్నరప్‌గా నల్లగొండ, రంగారెడ్డి జట్లు
- ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ



బాలుర విభాగం విజేత మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏఎంపీ దుంకుడు శ్రీనివాస్



బాలికల విజేత మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏఎంపీ దుంకుడు శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 14 రగ్బీ బాల, బాలికల టోర్నమెంట్ ముగిసింది. బాలుర, బాలికల విభాగాల్లో ఆతిథ్య పాలమూరు జట్లు అద్వితీయమైన ప్రతిభను కనబరిచాయి. ఈ రెండు విభాగాల్లో మహబూబ్‌నగర్ జట్లు విజేతగా నిలిచాయి.

హోరాహోరీ పోరులో..

బాలుర విభాగంలో మహబూబ్‌నగర్- నల్లగొండ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలి అర్ధ భాగంలో 2- 0 గోల్స్‌తో జిల్లా జట్టు ఆధిక్యం కొనసాగించింది. రెండో అర్ధ భాగంలో చివరి నిమిషంలో నల్లగొండ జట్టు ఒక గోల్ చేసినప్పటికీ అప్పటికే ఆట సమయం ముగియడంతో చివరగా 2- 1 గోల్స్ తేడాతో మహబూబ్‌నర్ జట్టు విజయం సాధించింది. అలాగే బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 2- 1 గోల్స్ తేడాతో రంగారెడ్డి జిల్లా జట్టుపై గెలుపొందింది. బాలుర, బాలికల మూడోస్థానాల్లో మెదక్ జట్లు నిలిచాయి.

జాతీయస్థాయిలో విజేతగా నిలవాలి

రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ రగ్బీ టోర్నీలో ఎంపికయ్యే రాష్ట్ర జట్లు సమష్టిగా ఆడి జాతీయస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభకనబరిచి విజేతగా నిలవాలని ఏఎంపీ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తి చాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తొలిగించి ఉత్సాహం నింపడం కోసం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండునెలపాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడంలో పీఈటీల కృషి అభినందనీయమన్నారు. ఇప్పటికే మూడు రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయని, ఒక జాతీయ స్థాయి టోర్నీ జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి మాట్లాడుతూ టోర్నీలో క్రీడాజట్లు బాగా ఆడారన్నారు. జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్లుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్‌రావు, రాష్ట్ర పరిశీలకులు కిష్టయ్య, యూనస్‌భాష, టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, పెటా టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, వడెన్న, జిల్లా రగ్బీ సంఘం కోశాధికారి బాలరాజు, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాలరాజు, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పరశురాం, పీడీలు వేణుగోపాల్, రామచందర్, ఉమాపతిరెడ్డి, నర్సింహులు, అరుణజ్యోతి, మేరిపుష్ప, ఆయా జిల్లాల సంఘం ప్రతినిధులు గణేష్, శ్రీనాథ్, తరుణ్, రవి, విజయేందర్, శంకరయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆది దంపతుల కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

అలంపూర్: కార్తీక మాసం చివరిరోజు ఆదివారం అలంపూర్ ఆలయాల్లో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ముందుగా అమ్మవారు, స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు ముగించారు. ఈఓ పురేందర్‌కుమార్, ధర్మకర్తలు జగన్‌మోహన్ నాయుడు, గోపాల్, వెంకటేశ్వర్లు ఆది దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.



హాజరైన భక్తులు

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



పతకం సాధించిన రవితో కోచ్ జ్ఞానేశ్వర్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు రమావత్ రవి ప్రతిభచాటాడు. ఈ పోటీల్లో రవి బంగారు పతకం సాధించి జంషెడ్‌పూర్‌లో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు.

టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం



నారాయణపేట: బెంగళూరులో జరిగిన 25వ ఆలిండియా నేషనల్ పోలీస్ లాన్ టెన్నిస్ డబుల్స్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీలో పాల్గొన్న మల్టీ జోన్-1లో ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణపేట ఎస్పీ రియాజ్ హుల్ హక్ లాన్ టెన్నిస్ ఫైనల్‌లో బంగారు పతకం సాధించారు. 50వ ప్లేస్‌లో తెలంగాణ జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుతో పోటీ పడగా ఫైనల్‌లో విజయం సాధించారు.

కురుమతిగిరులు జనసంద్రం



జాతర మైదానంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: పాలమూరు ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయానికి ఆదివారం అమావాస్య రోజున భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో కురుమూర్తిగిరులు మార్మోగాయి. అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి గండదీపాలు మోసి పచ్చిపులుసు, అన్నం నైవేద్యంగా సమర్పించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


పులకించిన శ్రీరామకొండ

- ఆదివారం అమావాస్య దర్శనానికి బారులుతీరిన భక్తులు

కోయిల్‌కొండ: కార్తీక మాసం ఆదివారం అమావాస్య సందర్భంగా మహిమాన్విత క్షేత్రం శ్రీరామకొండ భక్తజన సంద్రంగా మారింది. ఉదయం 3 నుంచి సాయంత్రం వరకు సుమారు లక్ష మందికిపైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి రామపాదాన్ని దర్శించుకున్నారు. ఉదయం కొండపై ఉన్న శ్రీరామపాదానికి అర్చకులు వై.రఘురామాచారి, డీఎం.రాఘవేందర్‌రావు పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమావాస్య రోజున రామపాదాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వచ్చిన భక్తులకు నవోదయ హాస్పిటల్ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామానికి చెందిన నజీమ్ అన్నదానం చేశారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



కొండపై స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

అలంపూర్ ఆలయాల్లో ఆంధ్రప్రదేశ్ ఐజీ

అలంపూర్: అలంపూర్ ఆలయాలను ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐజీ త్రివిక్రమ్‌వర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికి జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆయన వెంట అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్ఐ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



ఏపీ ఐజీ త్రివిక్రమ్‌వర్మకు స్వాగతం పలుకుతున్న అర్చకులు